# చిరంజీవి




"మనబ్బాయి నిన్న ప్రొద్దుట్నించీ కనిపించడం లేదండీ! వాడు సినిమాకు వెళ్లి ఉంటాడని రాత్రి వరకు ఎదురుచూశాను. అర్ధరాత్రి వరకూ రాకపోతే ఏ స్నేహితుడి ఇంట్లోనో పడుకుని వుంటాడు. 'ఉదయం వస్తాడులే!' అని అనుకున్నాను. వాడు ఇంతవరకూ రాలేదు. నాకేదో భయంగా వుందండీ!" కళ్ళనీళ్లతో అంది పార్వతి.

భార్యనలా చూసి చలించిపోయాడు రంగారావు.

"ఛ... ఏమిటిది చిన్నపిల్లలా?! ఈరోజు వస్తాడేమో చూసి, రాకపోతే రేపు పోలీస్ రిపోర్టు ఇద్దాంలే... నీవు భయపడకు!" భార్య భుజంపై చేయి వేసి ధైర్యం చెప్పాడు రంగారావు.

భార్య వేదన చూడలేకపోతున్నాడు రంగారావు.

నిజానికి రెండురోజుల క్రితం అతను కొడుకును మందలించాడు. ఎంతసేపూ క్రికెట్, సినిమాలు అంటూ కాలాన్ని వృధా చేస్తున్నాడని, చదువుపై నిర్లక్ష్యం పెరిగిందని కోప్పడ్డాడు. అందుకే అతను యింట్లోంచి పారిపోయాడు. అయితే ఆ విషయం భార్యతో చెబితే ఆమె మరింత భయపడుతుందని చెప్పలేదు. తాను ధైర్యం తెచ్చుకుని ఆమెను ఓదార్చసాగాడు.

ఇంతలో... బయట జీప్ ఆగిన శబ్దంమైంది. సి.ఐ. వర్మ వడివడిగా లోపలకు వచ్చాడు.

"మీకు గుడ్‌న్యూస్! మీ అబ్బాయి దొరికాడు."

"నిజంగా..?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారావు.

"అవును. ఇంకో గంటలో మీ ముందుంటాడు..." అంటూ సోఫాలో కూర్చున్నాడు వర్మ.

పార్వతి ఆనందానికి అంతులేదు.

"వర్మగారు మావాడ్ని ఎలా పట్టుకోగలిగారు? దయచేసి చెప్తారా?" అర్థింపుగా అన్నాడు రంగారావు.

"మీ అబ్బాయి డబ్బేమీ తీసుకుని పోలేదని అన్నారు కాబట్టి అతడు సిటీలోనే ఉన్నాడని నాకనిపించింది. మీ అబ్బాయి చదివేది ఎనిమిదో తరగతి కాబట్టి ఇది ప్రేమ కేసు అయివుండదు. మీ అబ్బాయి క్లాస్‌మేట్స్‌ని కొంతమందిని ఇంటర్‌వ్యూ చేస్తే నాకొక విషయం తెలిసింది. మీ అబ్బాయి ఒకరోజు అన్నం తినకుండా అయినా ఉండగలడు కానీ, చిరంజీవి సినిమా మొదటిరోజు మొదటి ఆట చూడకుండా ఉండలేడని! ఈరోజు చిరంజీవి కొత్త సినిమా రిలీజైంది. సిటీలో విడుదలైన ఎనిమిది థియేటర్లలో మావాళ్ళను మఫ్టీలో ఉంచాను. మీవాడు దొరికిపోయాడు."

"థాంక్యూ వర్మగారూ!" అన్నాడు రంగారావు ఆనందంగా.

"థాంక్స్ చెప్పాల్సింది నాకు కాదు... చిరంజీవికి!"

ఆ మాటకు ముగ్గురూ ఆనందంగా నవ్వుకున్నారు.

●

'ఆంధ్రభూమి' వారపత్రిక ... 30 ఏప్రిల్' 1992